


నివాసాలపై విద్యుత్ తీగలు


ఇంటిపై చేతికందే ఎత్తులో ఉన్న విద్యుత్‌తీగలు

రొద్దం : మండలంలోని గౌరాజుపల్లి గ్రామంలో ఎంపియుపి పాఠశాల సమీపంలో ఉన్న కాలనీలో నివాసాలపై పంట పొలాల్లోకి 11 కెవి విద్యుత్ లైన్ తీగలు లాగారు. దీంతో ఏ క్షణంలో ఏమి జరుగుతుందో అని కాలనీ వాసులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఈ విద్యుత్ లైన్‌ను 30 ఏళ్ల క్రితం ఏర్పాటు చేశారు. అప్పట్లో ఈ ప్రాంతంలో ఇళ్లు ఉండేవి. కాలక్రమేణా గ్రామ జనాభా పెరిగి కొత్తగా ఇళ్లు నిర్మించుకున్నారు. ఈ కాలనీ ఏర్పడి 20 ఏళ్లు అవుతోంది. కాలనీకి అటువైపు ఉన్న పంట పొలాల్లోకి ఇళ్ల మీదుగా 11 కెవి విద్యుత్ తీగలు లాగడంతో గాలి వాన ధాటికి, వర్షాకాలంలో ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులని కాలనీవాసులు ప్రశ్నిస్తున్నారు.అలాగే ఇళ్ల మధ్యలో ఏర్పాటు చేసిన సింగిల్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తక్కువ ఎత్తులో ఉందని ప్రమాదం జరిగి అవకాశాలు ఉండడంతో దానిని ఎత్తులో ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

'అనంత' ఆశలపై తుంగభద్ర నీళ్లు


తుంగభద్ర డ్యాము గేట్లు ఎత్తివేయడంతో వెళుతున్న నీరు


19వ గేటు నుంచి వృథాగా వెళుతున్న నీరు

కొట్టుకుపోయిన డ్యాము 19వ గేటు
వృథాగా వెళుతున్న నీరు
హెచ్‌ఎల్‌సి ఆయకట్టు రైతుల్లో ఆందోళన

తుంగభద్ర రిజర్వాయర్‌కు చెందిన 19వ గేటు శనివారం అర్ధరాత్రి కొట్టుకుపోయింది. దీంతో నీరు వృథాగా నదిలో కలుస్తోంది. డ్యామ్ గేట్ కొట్టుకుపోవడంతో తిరిగి రైతుల్లో గుబులు నెలకొంది. అది కూడా ఈసారి జులై నెలలో మంచి వర్షాలొచ్చి డ్యామ్ పుష్కలంగా నిండటంతో ఇబ్బందులుండవని భావించారు. కాని శనివారం రాత్రి డ్యామ్ గేటు ఒకటి కొట్టుకునిపోవడంతో తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ఆయకట్టు రైతుల్లోనూ జిల్లా దాహార్తికి ఇక్కట్లు తప్పేలా లేవు. ఈ ఏడాది 26 టిఎంసిల నీరు రావచ్చునని అధికారులు ముందుగా అంచనా వేసి అందుకు తగ్గట్టు ప్రణాళికలు రూపొందించారు. ఈ మేరకు రాయదుర్గం, ఉరవకొండ ప్రాంతాల్లో ఇప్పటికే వరి, మిరప పంటలను సాగు చేసియున్నారు. అయితే ఇప్పుడు సీజన్ ముగిసే వరకు నీరొస్తుందా లేదా అన్న సందేహాలు రైతుల్లో నెలకొన్నాయి. ఎందుకంటే ప్రస్తుతం డ్యామ్ నిండుగానున్నా గేటు పోవడంతో నీరు వృధాగా నదిలోపోతోంది.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లాలో గడిచిన రెండు సంవత్సరాలుగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్న తరుణంలో తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువపైనే ఆయకట్టు రైతులు ఆశలు పెట్టుకున్నారు. తుంగభద్ర డ్యామ్ గేటు కొట్టుకుపోవడంతో ఆ ఆశలపై నీళ్లు చల్లినట్టయింది. నిత్యం దుర్భిక్ష ప్రాంతమైన అనంతపురం జిల్లాకు ఏకైక నిఖర జలాలున్న జలవనరు తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ. కర్నాటక రాష్ట్రంలో హొస్పేట్ ప్రాంతంలోనున్న తుంగభద్ర డ్యామ్ నుంచి కుడి ఎగువ ప్రధాన కాలువ అనంతపురం జిల్లాకు వస్తుంది. ఇందులో 105 కిలోమీటర్లు కర్నాటకలో ప్రవహించి అనంతపురం జిల్లాలోని రాయదుర్గం నియోజకవర్గంలోని బొమ్మనహాల్ వద్ద ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవహిస్తుంది. ఈ కాలువకు 35.2 టిఎంసిల నీటి కేటాయింపులున్నాయి. ఈ నీళ్లు అనంతపురం జిల్లాతోపాటు కర్నూలు, కడప జిల్లాలకు కేటాయింపులు చేయబడి ఉన్నాయి. 2.489 లక్షల ఎకరాలు రిజిస్టర్డ్ ఆయకట్టు ఉంది. ఇందులో ఒక్క అనంతపురం జిల్లాలోనే 1.45 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. అయితే పూడిక, తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ఆధునీకరణ లేకపోవడం వంటి వాటితో ఏడాదికి సగటున 26 టిఎంసిల నీరు మాత్రమే ఎగువ ప్రధాన కాలువకు వస్తున్నాయి. ఇందులోనూ పది టిఎంసిల వరకు తాగునీటికి వాడుతుండగా, తక్కినవి పంటల సాగుకు వినియోగిస్తున్నారు. ఈ ఏడాది కూడా జూన్‌లో జరిగిన తుంగభద్ర బోర్డు మొదటి సమావేశంలో 26 టిఎంసిల నీరు ఇచ్చే విధంగా నిర్ణయం చేశారు. అందుకు అనుగుణంగా జులై నెలలో మంచి వర్షాలు పడ్డాయి. దీంతో తుంగభద్ర డ్యామ్‌కు ఈ ఏడాది సాధారణం కంటే ఎక్కువగానే నీరు చేరాయి. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 255 టిఎంసిల నీరు డ్యామ్‌కు వచ్చాయి. ఇప్పటికీ 54 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లోస్ డ్యామ్‌లోకి వస్తున్నాయి. 33 ప్రధాన గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదిలారు. ఇటువంటి సమయంలో 19వ గేటు పడిపోయి నీరు వృథాగా నదిలోకిపోతోంది. దీన్ని సరిచేయాలంటే నీటి మట్టం 1633 అడుగుల నుంచి 1613 అడుగులకు తగ్గిపోవాలి. అంత వరకు ప్రధాన గేటు మరమ్మతుకు నోచుకునే అవకాశం లేదు.



గతేడాది నీరు లేక అవస్థలు- ఇప్పుడు నీరుండి ఇక్కట్లు

2023 ఖరీఫ్‌లో వర్షాల్లేకపోవడంతో పంటలు సరిగా పండలేదు. చివరకు తుంగభద్ర డ్యామ్‌కు కూడా 95 టిఎంసిల వరకే నీర్లు రావడంతో ఆయకట్టు రైతులు కూడా నష్టపోయారు. ఈ ఏడాది తుంగభద్ర డ్యామ్ ఎగువ భాగంలో మంచి వర్షాలు పడటంతో నీరు పుష్కలంగా వచ్చింది. ఈసారి ఆయకట్టుకూ ఇబ్బందులుండవని భావించారు. రాయదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో మిరప, వరి పంటలను పెద్దఎత్తున సాగు చేశారు. ఇప్పుడు పంటలు పెట్టుకున్న తరుణంలో డ్యామ్ గేటు పడిపోయి నీరు వృథాగా నదిలోకి పోతోంది. డ్యామ్‌లో నీరంతాపోతే ఆయకట్టుకు నీరొస్తుందా లేదా అన్న ఆందోళన రైతుల్లో నెలకొంది. ఎందుకంటే తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు నీరు 1600 అడుగుల వరకే అందుతుంది. అంటే 21 టిఎంసిలు డ్యామ్‌లో ఉంటేనే నీరు ఎగువ ప్రధాన కాలువకు అందదు. ఇప్పుడు 1613 అడడుగుల కంటే దిగువకు నీరు వెళితేనే ప్రధాన గేటు మరమ్మతులు చేపట్టేందుకు వీలుంటుంది. అంత వరకు నీరు వృథాగా పోతోంది. మరమ్మతుల తరువాత వర్షాలు రాకపోతే సమస్య తలేత్తే అవకాశాలున్నాయన్న ఆందోళన సర్వత్రా నెలకొంది.

ప్రత్యక్షంగా పర్యవేక్షణకు జిల్లా నేతలు

తుంగభద్ర డ్యామ్ గేటు పడిపోయిందన్న విషయం తెలిసిన వెంటనే ఆర్థిక శాఖమంత్రి పయ్యావుల కేశవ్ స్పందించారు. తుంగభద్ర బోర్డు అధికారులతోనూ, జిల్లా హెచ్‌ఎల్‌సి అధికారులతో చర్చించారు. సాధ్యమైనంత త్వరగా గేటు ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసకోవాలని సూచించినట్టు ఆయన విడుదల చేసిన విడియోలో తెలిపారు. ఈ ఘటన దురదృష్టకరమని కూడా పేర్కొన్నారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా అవసరమైన అన్ని రకాల చర్యలను తీసుకుంటామని భరోసానిచ్చారు.


గేటు కొట్టుకుపోవటంతో వృథాగా వెళుతున్న నీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలవ

తుంగభద్ర డ్యాం గేటు కొట్టుకుపోవడం దురదృష్టకరం

రాయదుర్గం : తుంగభద్ర రిజర్వాయర్ 19వ నంబర్ గేటు నదిలో కొట్టుకుపోవడం దురదృష్టకరమని రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అన్నారు. ఈమేరకు ఆయన ఆదివారం తుంగభద్ర ప్రాజెక్టు సందర్శించి 19వ గేటు వద్ద నదిలో వెళ్లే నీటి ప్రవాహ ఉధృతిని పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ శనివారం రాత్రి తుంగభద్ర ప్రాజెక్టు గేటు నదిలో కొట్టుకుపోవడం దురదృష్టకరమన్నారు. ఆంధ్ర, కర్నాటక రాష్ట్రంలోని ఎనిమిది జిల్లాలకు సాగు, తాగునీరు అందించే తుంగభద్ర రిజర్వాయర్‌కు ఈసారి ముందుగానే నీరు వచ్చి జూలై నెలలోనే నిండి ఉండడం ఈ ప్రాంత ప్రజలు, రైతుల్లో ఆనందం నింపిందన్నారు. ఈసారి తాగు, సాగునీటికి ఢోకా ఉండదని అనుకున్న తరుణంలో రిజర్వాయర్ 19వ గేటు కొట్టుకుపోవడం ఆందోళనకరం అన్నారు. ఈ గేటు నుండి 30 వేల క్యూసెక్కుల నీరు నదిలోకి వెళ్తున్నట్లు చెప్పారు. దీని ఒత్తిడి తగ్గించేందుకు అధికారులు ఇతర గేట్ల ద్వారా 90 వేల క్యూసెక్కుల నీటిని నదిలోకి వదిలినట్లు చెప్పారు. కనీసం 64 టీఎంసీల నీరైన రిజర్వాయర్లో నిల్వ ఉండేలా అధికారులు ప్రయత్నిస్తుంటే 50 టీఎంసీలకు నీటి సామర్థ్యం పడిపోయే పరిస్థితి వచ్చిందన్నారు. వీలైనంత ఎక్కువ నీరు రిజర్వాయర్లో నిలుపుకోవాలని తాము అధికారులకు విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. గేటు కొట్టుకుపోవడం మానవతప్పిదమైతే ఇంతకంటే నేరం, ఘోరం మరొకటి ఉండదన్నారు. తుంగభద్ర బోర్డు కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉందని, ఈ ఏడాది కూడా రిజర్వాయర్ వార్షిక తనిఖీ జరిగిందని అన్నారు. అన్ని గేట్లు బాగున్నాయని నిపుణులు చెప్పినట్లు తెలిపారు. అయితే గేట్లను లాగే పుల్లింగ్ చైన్ సామర్థ్యం తక్కువగా ఉండటం వల్ల గేటు తెగిపోయి ఉండవచ్చని భావిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి రామానాయుడు, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ టీబీ డ్యాం గేటు పరిరక్షణ విషయమై అవసరమైన చర్యలు తీసుకోమని పురమాయించినట్లు చెప్పారు. తక్షణం ప్రత్యామ్నాయ గేటు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరినట్లు చెప్పారు. ఇంజనీరింగ్ నిపుణుడు కన్నయ్య నాయుడు 4 అడుగులకు ఒకటి చొప్పున దశలవారీగా గేటు ఏర్పాటు చేసేందుకు డిజైన్ రూపొందించి ప్రభుత్వానికి బోర్డుకు ఇచ్చినట్లు చెప్పారు. గేటు కొట్టుకుపోయే ఘటనపై విచారణ జరపాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని తుంగభద్ర బోర్డు అధికారులను కోరుతున్నామన్నారు. కాగా తుంగభద్ర రిజర్వాయర్ నుండి నదిలోకి నీరు వథాగా పోకుండా అవసరమైన చర్యలను తుంగభద్ర బోర్డు అధికారులు చేపట్టారు గేట్ల వద్ద చైన్లకు అవసరమైన మరమ్మతు పనులు మొదలెట్టారు. రబ్బరు గేట్ల ద్వారా తక్షణం నదిలో వృథాగా వెళ్లే నీటిని నిలువ చేసుకునే ప్రయత్నాన్ని కూడా పరిశీలిస్తున్నారు.


మరమ్మతులు చేపడుతున్న ఇంజినీరింగ్ నిపుణులు

డ్యామ్‌ను పరిశీలించిన కర్నాటక డిప్యూటీ సిఎం

తుంగభద్ర డ్యామును కర్నాటక రాష్ట్ర డిప్యూటీ చీఫ్ మినిస్టర్ డి కె శివకుమార్ ఆదివారం పరిశీలించారు. తుంగభద్ర బోర్డు ప్రత్యామ్నాయ గేటు ఏర్పాటు రిజర్వాయర్‌లో నీటి పరిరక్షణ చర్యల గురించి అధికారులతో చర్చించారు.

వెంటనే మరమ్మత్తులు చేపట్టాలి : మాజీ ఎమ్మెల్యే విశ్వ

తెగిపోయిన తుంగభద్ర డ్యామ్ గేటును తక్షణం మరమ్మతులు చేపట్టే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే రెండు లక్షల క్యూసెక్కుల వరకు నీరు వృథాగా నదిలోకి పోయిందన్నారు. జిల్లాలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న తరుణంలో ఈ రకమైన ఘటనలు చోటు చేసుకోవడం దురదృష్టకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కర్నాటక ప్రభుత్వంతో చర్చించి రెండు బోర్డు అధికారులతో సమన్వయం చేసుకుని పనిచేయాలని సూచించారు.

డ్యాం భద్రతపై పటిష్ట చర్యలు తీసుకోవాలి

96 ఏళ్ల డ్యాం చరిత్రలో మొట్టమొదటిసారి గేటు కొట్టుకుపోయింది. డ్యామ్ భద్రతపై కర్నాటక ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు తక్షణం సమీక్షించి అవసరమైన చర్యలు వెంటనే తీసుకోవాలి. అందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చొరవ చూపాలి. కర్నాటకలో కురుస్తున్న అధిక వర్షాల వల్ల డ్యాంకు నీటి ప్రవాహం భారీగా పెరిగింది. ఇప్పటికే ప్రతిరోజు లక్ష క్యూసెక్కుల నీరు కిందకు వదులుతున్నారు. ఈ నీటిని నిలువ చేసుకునే సామర్థ్యం మన రాష్ట్రంలో లేకపోవడంతో అత్యధిక నీరు సముద్రంలో కలిసిపోతోంది. మూడు సంవత్సరాల క్రితం కూడా ఇదే పరిస్థితి ఏర్పడింది. ఒకవైపు జిల్లాలో వర్షాలు లేక అత్యధిక సాగుభూములు బీడుగా మారుతుంటే మరోవైపు డ్యామ్ లో ఉన్న నీటిని సక్రమంగా ఉపయోగించుకునే పరిస్థితి లేకపోవడానికి మన రాష్ట్ర ప్రభుత్వాలే బాధ్యత వహించాలి. వరద కాలువను నిర్మించాలని తద్వారా డ్యామ్ నుండి వచ్చే అదనపు నీటిని కింది భాగంలో ఉన్న అనంతపురం జిల్లా అభివద్ధికి ఉపయోగించాలని చాలా కాలంగా జిల్లా ప్రజలు కోరుతున్నా ప్రభుత్వాల్లో కనీస చలనం లేదు. కరువుకు పకృతిని కారణంగా చూపే నాయకులు వరదనీరు సముద్రం పాలు కావడానికి బాధ్యత వహించాలి. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం వరద కాలువ నిర్మాణానికి వెంటనే చర్యలు తీసుకోవడంతో పాటు, హెచ్‌ఎల్సీ ఆధునీకరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి. తుంగభద్ర డ్యామ్ లో కొట్టుకుపోయిన 19వ గేటును వీలైనంత త్వరగా ఏర్పాటు చేసి నీరు వధా కాకుండా చూడాలి.



వి. రాంభూపాల్,
సిపిఎం జిల్లా కార్యదర్శి

యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలి

నీటి తాకిడికి కొట్టుకుపోయిన తుంగభద్ర డ్యాం 19 వ గేటును యుద్ధ ప్రాతిపదికన అమర్చి రైతులను ఆదుకోవాలి. ఆంధ్రప్రదేశ్, కర్నాటక ,తెలంగాణ రాష్ట్రాలకు సాగు , తాగునీటికి జీవన ఆధారమైన తుంగభద్ర డాం నీటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. తక్కువ నష్టంతో బయటపడేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలి. పాలకవర్గాలు ఇప్పటికైనా ఈ ఘటనతో కనువిప్పు కలిగి రైతాంగ ప్రయోజనాలకు నష్టం జరగకుండా ప్రాజెక్టుల నిర్వహణకు తగినంత నిధులు కేటాయిస్తూ తగినంత మందిని సిబ్బందిని నిపుణులను ఎప్పటికప్పుడు నియమించాలి.



జి. ఓబులు,
సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి ఓబులు

వైబి హళ్లి రోడ్డులో వంతెనలు నిర్మించండి

ప్రజాశక్తి-మడకశిర రూరల్


కుచించుకు పోయిన బ్రిడ్జి

ఎంతో ప్రాముఖ్యత ఉన్న మండలంలోని వైబి హళ్లి గ్రామం అభివృద్ధికి ఆమడదూరంలో ఉందని చెప్పవచ్చు. ఈ గ్రామం నుంచి ముగ్గురు ఎమ్మెల్యేలుగా, ఒకరు ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. అలాగే జిల్లా పరిషత్ అధ్యక్షులుగా, 12 ఏళ్ల సమితి అధ్యక్షులుగా పని చేసిన నాయకులు ఉన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లా పరిషత్ ఏర్పడినప్పుడు తొలి జడ్పిటిసిగా ఒక మహిళ ఈ గ్రామం నుంచి ఎన్నికయ్యారు. అలాంటి గ్రామానికి నేటికీ సరైన రోడ్డు కూడా లేకపోవడం గమనార్హం. రెండు దశాబ్దాల కాలంలో నియోజకవర్గంలోని ప్రతి పంచాయతీ అభివృద్ధి చెందినా ఈ గ్రామం వైపు ఏ నాయకుడు చూడలేదు. గ్రామస్తులు పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నా ఫలితం లేకపోయింది. వైబి హళ్లి గ్రామం నుంచి మడకశిరకు వచ్చే దారిలో రెండు చోట్ల ఆ గ్రామానికి చెందిన చెరువు మరువవంక ఉంది. ఆ వంకపై రెండు చోట్ల మూడు దశాబ్దాల క్రితం చిన్న వంతెనలు నిర్మించారు. వర్షం వస్తే మరువ వంక నీరు వంతెనపై ప్రవహించడంతో గ్రామానికి రాకపోకలు పూర్తిగా నిలిచిపోతాయి. దీంతో కోడిపల్లి, కోనప్పపాలెం, వైబి.హళ్లి గ్రామానికి చెందిన ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వైబి.హళ్లి గ్రామానికి వెళ్లే మార్గంలో కొత్త వంతెనలు నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


శిథిలావస్థలో ఉన్న వంతెన

ప్రయాణికుల క్షేమమే ఆర్టీసీ లక్ష్యం

ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి మధుసూదన్




జిల్లా ప్రజా రవాణ శాఖాధికారి మధుసూదన్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

ఆర్టీసీ ప్రయాణికుల క్షేమమే లక్ష్యంగా ఎపిఎస్ ఆర్టీసీ పని చేస్తోందని ఆసంస్థ జిల్లా ప్రజా రవాణా అధికారి మధుసూదన్ తెలిపారు. దేశంలోనే అతిపెద్ద రవాణా రంగంగా ఆర్టీసీ పేరుపొందింది. మారుతున్న సమాజానికి అనుకూలంగా ఆర్టీసీ సంస్థలో తీసుకొచ్చిన సంస్కరణల వల్ల ప్రజలు కూడా ఆర్టీసీ ప్రయాణమే సురక్షితమనే స్థాయికి సంస్థ ఎదిగింది. కానీ ఇంకా మారుమూల గ్రామాలకు బస్సు సౌకర్యం లేకపోవటంతో ఇప్పటికీ కిక్కిరిసిన ఆటోలలో, క్యాబ్‌లలో ప్రజలు ప్రయాణిస్తున్నారు. అలాంటి ప్రయాణం ప్రమాదం అని తెలిసినా పలు ప్రాంతాలలో ప్రైవేటు వాహనాల ప్రయాణం తప్పనిసరి అయింది. పలుచోట్ల ఆర్టీసీ సమయపాలన పాటించకపోవడంతో ప్రయాణికులు విసిగిపోయి ఆటోలలో, ఇతర వాహనాలలో ప్రయాణిస్తూనే ఉన్నారు. ప్రయాణికులకు అనుకూలంగా ఆర్టీసీ మరింత సేవా గుణంతో పనిచేయాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా అధికారి మధుసూదన్ ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖి ఇంటర్వ్యూలో పలు అంశాలను వెల్లడించారు.

ప్రశ్న : జిల్లాలో ఎన్ని డిపోలు ఉన్నాయి? బస్సుల సంఖ్య ఎంత? ఎంత మంది ఉద్యోగులు ఉన్నారు.?

జవాబు : జిల్లాలో ఆరు డిపోలు ఉన్నాయి. పుట్టపర్తి, కదిరి, ధర్మవరం, పెనుకొండ, హిందూపురం, మడకశిరలో ఆర్టీసీ డిపోలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం 395 బస్సులు నడుస్తున్నాయి. ఇందులో 110 బస్సులు హైయర్ బస్సులు ఉన్నాయి. 1670 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. ప్రతి డిపోలోను గ్యారేజీ ఏర్పాటు చేయడం జరిగింది. రోజు బస్సుల పర్యవేక్షణ ఉంటుంది. డ్రైవర్ ఇచ్చిన కంప్లైంట్ మేరకు గ్యారేజీలోని మెకానిక్‌లు ఆ బస్సులను మరమ్మతు చేపడుతుంటారు.

ప్ర : రోజూ ఎన్ని కిలోమీటర్లు బస్సులు నడుస్తాయి? ప్రయాణికులు ఏ మేరకు ప్రయాణిస్తుంటారు.?

జ : రోజూ 1.45 లక్షల కిలోమీటర్లు జిల్లా వ్యాప్తంగా బస్సులు నడుస్తున్నాయి. ఇందులో 1.20 లక్షల మంది రోజు ప్రయాణిస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు ఆర్టీసీ 55 లక్షల రూపాయల ఆదాయంతో ఉంది. గతంలో బస్సుల డీజల్ ఆదా 69 శాతం ఉండగా ఆ సంఖ్య ఇప్పటికి 72 శాతానికి చేరింది. డీజిల్ ఆదా శాతం మరింత పెంచడానికి కృషి చేస్తున్నాము.

ప్ర : ప్రధాన నగరాలకు పట్టణాలకు కల్పిస్తున్న బస్సు సౌకర్యం గురించి చెప్పండి.?

జ : జిల్లావ్యాప్తంగా అన్ని డిపోల నుంచి ముఖ్యమైన నగరాలకు, పట్టణాలకు బస్సు సౌకర్యం ఉంది. బెంగళూరు, చెన్నై, హైదరాబాదు, విజయవాడ, ఒంగోలు, శ్రీశైలం, తిరుపతి తదితర నగరాలకు బస్సు సౌకర్యం కల్పిస్తున్నాము. ప్రతి పౌర్ణమి రోజుకు ముందుగా అరుణాచలానికి భక్తుల సౌకర్యార్థం బస్సులు నడుపుతున్నాము. ఈ శ్రావణమాసంలో కూడా శ్రీశైలం, తిరుపతి, కసాపురం, మురిడి, నేమకల్లు తదితర పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నాము. ప్రయాణికుల కోసం ఫోన్‌పే తో నగదు రహిత ప్రయాణాలకు అనుమతి ఇచ్చాము.

ప్ర : బస్సులో ఏయే వర్గాలకు రాయితీ ఇస్తున్నారు.?

జ :- సీనియర్ సిటిజన్లకు 25 శాతం రాయితీ కల్పిస్తున్నాము. వికలాంగులకు 50 శాతం రాయితీ కల్పిస్తున్నాము. జిల్లాలో మూడు వేలమంది వికలాంగులు ఈ రాయితీ పొందుతున్నారు. పదవ తరగతి వరకు చదువుకునే అమ్మాయిలకు ఉచిత బస్సు సౌకర్యం ప్రభుత్వం కల్పించింది.

ప్ర: జిల్లాలో ఎన్ని బస్సు స్టేషన్లు ఉన్నాయి? కొత్త బస్సులు రానున్నాయా.?

జ : జిల్లా వ్యాప్తంగా ఆరు బస్సు స్టేషన్లు ఉన్నాయి. మండల కేంద్రాల్లో మరో 10 బస్సు స్టేషన్లు ఉన్నాయి. కొత్త బస్సులు మరో 50 రానున్నాయి. ఇందులో 20 సూపర్ లగ్జరీ బస్సులు ఉన్నాయి. అవసరాన్ని బట్టి మారుమూల మండలాలకు బస్సులు నడుపుతున్నాము. అలాగే అంతర్ జిల్లాలకు, అంతర్ రాష్ట్రాలకు బస్సులు నడుపుతున్నాము.

ప్ర : సమయపాలన పాటించని, నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై తీసుకొనే చర్యలు ఏమిటి? సిబ్బంది కొరత ఉందా.?

జ: సిబ్బంది కొరత అంటూ ఏమీ లేదు. సమయపాలన పాటించని, క్రమశిక్షణ లేకుండా, నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై తగు చర్యలు తీసుకుంటున్నాము. అయితే నూటికి ఒకరు లేక ఇద్దరు మాత్రమే నిర్లక్ష్యం చూపుతుండవచ్చు. వారు కూడా మారే అవకాశం ఉంది. నెలలో ఒకసారి ఆ డ్రైవర్లు, కండక్టర్లకు అవగాహన, శిక్షణ తరగతులు నిర్వహిస్తూనే ఉంటాము. అంతేకాక ఉత్తమ డ్రైవర్లుగా, కండక్టర్లుగా ఎంపికైన వారికి ప్రశంస పత్రాలతో పాటు నగదు బహుమతులు అందజేస్తూ ప్రోత్సహిస్తున్నాము. ప్రయాణికులే సంస్థకు ఆదాయ వనరు, వారి పట్ల మర్యాదగా నడుచుకోవాలని శిక్షణలో చెబుతుంటాము. గతంతో పోల్చితే ఇప్పుడు సిబ్బంది పనితీరు గణనీయంగా మారిందని భావిస్తున్నాను.

ప్ర : ప్రయాణికులకు మీరు ఇచ్చే సలహాలు సూచనలు ఏమిటి.?

జ : ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్యాలకు చేర్చడమే లక్ష్యంగా ఆర్టీసీ పని చేస్తోంది. కేవలం ప్రజల సౌకర్యార్థం కోసమే లాభేక్ష లేకుండా ఆశించకుండా ప్రభుత్వం సంస్థను నడుపుతోంది. ఆర్టీసీ బస్సు అనేది ప్రయాణికుల ప్రజల ఆస్తి అని భావించాలి. ఆర్టీసీ బస్సులలోనే ప్రయాణించి క్షేమంగా ఉండాలని కోరుతున్నాం. ఎక్కడైనా ఎవరికైనా ఆయా రూట్లలో ఇబ్బందులు ఏర్పడితే ఆయా డిపో మేనేజర్లకు డయల్ యువర్ మేనేజర్ కార్యక్రమంలో పాల్గొని ఫోన్ ద్వారా సమస్యలను వివరించవచ్చు లేదా నేరుగా ఆయనకు ఫిర్యాదు చేయవచ్చు.

రెచ్చిపోతున్న కలప మాఫియా

ప్రజాశక్తి-హిందూపురం

కలప మాఫియా ప్రభుత్వ స్థలమా.. ప్రయివేటు స్థలమా.. కార్యాలయమా అనేవేవీ పట్టించు కోకుండా రెచ్చిపోతున్నారని చెప్పవచ్చు. ఎక్కడ మహా వృక్షాలు ఉంటే అక్కడి వాలిపోయి వాటిని అడ్డంగా నరికేస్తున్నారు. వారిని నియంత్రిం చాల్సిన అటవీ శాఖ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతూ వారికి అండగా నిలుస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. కొంత కాలంగా హిందూపురం నియోజక వర్గంతో పాటు పెనుకొండ, మడకశిర నియోజక వర్గాల వ్యాప్తంగా కలప మాఫియా రెచ్చిపోతుంది. ఎక్కడ పెద్ద పెద్ద చెట్లు కనిపించినా వాటిని తెగ నరికి కలపను సామిల్లుకు లేదా కర్నాటక ప్రాంతాల కు తరలిస్తున్నారు. గతంలో చిలమత్తూరు మండలం వీరాపురం వద్ద సైబేరియన్ పక్షులకు నివాస ప్రాంతాల్లో వందల చెట్లు కనీస అనుమతులు లేకుం డా నరికి కలప తరలించారు. అలాగే హిందూపురం మండలంలోని చెలివెందుల అటవీ ప్రాంతంలో కూడా చెట్లను నరికారు. ప్రభుత్వ స్థలాలు,


పరిగి సిరికల్చర్ కార్యాలయ ఆవరణలో నరికివేసిన చెట్టు

కార్యాలయాల వద్ద ఉన్న చెట్లను నరకాలంటే తప్పని సరిగా అటవీశాఖ అధికారులు పరిశీలించి అనుమతులు ఇచ్చిన తర్వాత బహిరంగ వేలం నిర్వహించి, హెచ్చు పాటదారులకు చెట్లను ఇస్తారు. అయితే తాజాగా పరిగి సిరికల్చర్ కార్యాలయ ఆవరణలో ఆదివారం ఎవరి అనుమతులు లేకుండా చెట్లను నరికారు. ఈ విషయంపై అధికారులను సంప్రదించడానికి ప్రయత్నించగా ఎవరూ స్పందించక పోవడం గమనార్హం.

వాల్టా చట్టాన్ని కఠినంగా అమలు చేయాలి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ఉమ్మడి అనంతపురం జిల్లాలో వాల్టా చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని పర్యావరణ వేత్త డాక్టర్ భాస్కర్ నాయుడు కోరారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో అతి తక్కువ వర్షపా తం నమోదవుతున్న తరుణంలో చెట్లను విరివిగా పెంచాలని ప్రభుత్వం వాల్టా చట్టాన్ని అమలులోకి తెస్తే ఆ చట్టానికి కొందరు అటవీ శాఖ అధికారులు తూట్లు పొడుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడా ఏ చెట్టునూ కొట్టకూడదని నిబంధనలు ఉన్నా చాలా చోట్ల ఆ నిబంధనలను తుంగ లో తొక్కుతున్నారన్నారు. రోడ్ల విస్తరణ, విద్యుత్ లైన్లు, లేఅవుట్లు, తదితర కారణాలు చూపి దశాబ్దాల నాటి మహా వృక్షాలను సైతం నరికి వేస్తున్నారన్నారు. ఇదే రీతిలో చెట్లను నరికితే అనంత పురం జిల్లా తీవ్ర కరువు కోరల్లో చిక్కుకునే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఎవరైనా చెట్లను నరికితే వెంటనే అటవీ శాఖ అధికారులు నోటీసులు


తరలిస్తున్న కలపను అడ్డుకున్న కప్పలబండ విఆర్ఎలు

జారీ చేసి వాహనాలను సీజ్ చేయాలని కోరారు. ఈ క్రమంలోనే ఆదివారం మండలంలోని కప్పలబండ గ్రామంలో కొందరు కర్నాటక కలప వ్యాపారులు చెట్లను నరికి కలపను వాహనాల్లో తరలిస్తుండగా పర్యావరణవేత్తలు అడ్డుకొని తహశీల్దార్ అనుపమకు సమాచారం ఇచ్చారు. తహశీల్దార్ ఆదేశాల మేరకు విఆర్ఎలు అక్కడికి చేరుకుని కలప రవాణాను అడ్డుకొని సదరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాల కట్టడికి కృషి

కదిరి అర్బన్ సిఐ డివి. నారాయణరెడ్డి

ప్రజాశక్తి-కదిరి టౌన్

పట్టణ పరిధిలో అసాంఘిక కార్యకలాపాల కట్టడికి చర్యలు తీసుకుంటామని అర్బన్ సిఐ డివి నారాయణరెడ్డి తెలిపారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం అర్బన్ సిఐగా డివి.నారాయణరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈయన అనంతపురం ట్రాఫిక్ సిఐ నుంచి పట్టణ సిఐగా వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న సిఐ పుల్లయ్యను విఆర్‌కు పంపారు. నూతన సిఐ మాట్లాడుతూ అక్రమ మద్యం, గంజాయి, ట్రాఫిక్‌పై దృష్టి సారిస్తామన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతకుముందు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ బాబ్‌జాన్, సిబ్బంది నూతన సిఐకి స్వాగతం పలికారు. అలాగే బదిలీపై వెళ్తున్న సిఐ పుల్లయ్యను పట్టణ ఎస్ఐ బాబ్‌జాన్ ఆధ్వర్యంలో సిబ్బంది ఘనంగా సన్మానించారు.



గోరంట్ల సిఐగా శేఖర్

గోరంట్ల : నూతన సిఐగా శేఖర్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న సిఐ సుబ్బరాయుడు వీఆర్‌కు వెళ్లారు. నూతన సిఐ శేఖర్‌ను టిడిపి మండల నాయకులు నిమ్మల శ్రీధర్, తదితరులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి పండ్ల బొకే అందజేశారు. సిఐ శేఖర్ మాట్లాడుతూ పట్టణంలో నెలకొన్న ట్రాఫిక్ సమస్యను త్వరగా పరిష్కరిస్తా మని తెలిపారు. మండలంలో అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచుతామని తెలిపారు. సిఐని కలిసిన వారిలో నాయకులు నరేష్, టిడిపి పట్టణ అధ్యక్షుడు కె.రఘునాథ్‌రెడ్డి, బాబు, సుబ్రహ్మణ్యం, తదితరులు ఉన్నారు.


సిఐ శేఖర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న టిడిపి నాయకులు

హోరాహోరీగా టీచర్స్ ఫ్రెండ్లీ క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి-కదిరి టౌన్

సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి, ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని పట్టణంలోని ఎస్‌టి ఎస్ఎన్ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న టీచర్స్ ఫ్రెండ్లీ క్రికెట్ పోటీలు హోరాహోరీగా సాగుతు న్నాయి. టోర్నమెంటులో భాగంగా రెండో రోజైన ఆదివారం ముఖ్య అతిథిగా హాజరైన గోరంట్ల ఎంఇఒ జాన్ రెడ్డప్ప పోటీలను ప్రారంభించారు. ఉదయం జరిగిన మొదటి మ్యాచ్‌లో గోరంట్ల జట్టుపై కదిరి జట్టు విజయం సాధించింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా అనిల్ ఎంపికయ్యాడు. రెండో మ్యాచ్‌లో తనకల్లు-2పై ఎన్‌పి కుంట జట్టు గెలుపొందగా ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా సందీప్ ఎంపికయ్యారు. మూడో మ్యాచ్‌లో అమడుగూరు జట్టుపై నల్లమాడ జట్టు విజయం సాధించింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా సంతోష్ ఎంపికయ్యాడు. వీరికి సీనియర్ క్రికెటర్లు హరిప్రసాద్‌రెడ్డి, ఆజంబాషా జ్ఞాపికలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో టోర్నీ నిర్వాహకులు అశ్వర్థ నారాయణ, గోపాల్, శివరామకృష్ణ, మనోహర్, నాగేంద్ర, రుద్రమరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


టీచర్స్ ఫ్రెండ్లీ క్రికెట్ పోటీల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు

అంబేద్కర్ విగ్రహ శిలాఫలకం ధ్వంసం దారుణం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

వైసిపి ప్రభుత్వ హయాంలో విజయవాడ నడిబొడ్డున ఏర్పాటు చేసిన 125 అడుగుల అంబేద్కర్ విగ్రహ శిలాఫలాకాన్ని ధ్వంసం చేయడం దారుణమని వైసిపి ఎస్సీ, ఎస్టీ సెల్ నాయకులు తెలిపారు. పట్టణంలో ఆదివారం వారు మాట్లాడుతూ ఈ దుశ్చర్యకు పాల్పడిన టిడిపి గూండాలను వెంటనే అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అలాగే అంబేద్కర్ విగ్రహానికి కేంద్ర బలగాలతో రక్షణ కల్పించాలని కోరారు. హోం మంత్రి అనిత ఎస్సీ కులానికి చెందిన వ్యక్తి అయినా ఇంతవరకూ స్పందించకపోవడం దారుణమన్నారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న భౌతిక దాడులపై నోరు విప్పకపోవడం సిగ్గుచేటు అన్నారు. హోం మంత్రి తక్షనమే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, చౌడయ్య, సల్లప్ప, గోపాల్, కిట్టు, శివయ్య, రమణ, కృష్ణమూర్తి, అశోక్, నరసింహులు, కుళ్లాయప్ప, లక్ష్మీనారాయణ, మల్లికార్జున, భవాని, శివ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల జిల్లా కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పంచాయతీ కార్యదర్శుల జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం స్థానిక ఎంపీడీవో కార్యాల యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ జిల్లాలో పంచా యతీ కార్యదర్శులను కలుపుకొని సమస్యలను పరిష్కరించేందుకు పోరాటాలు చేస్తామని తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా రామ్మోహన్, ప్రధాన కార్యదర్శిగా జె.ఈశ్వర్, ట్రెజరర్‌గా జయపాల్‌రెడ్డి, గౌరవా ధ్యక్షులుగా బి.గోపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా గోపీ నాథ్, గణేష్‌రెడ్డి, అసోసియేట్ ప్రెసిడెం ట్‌గా రిజ్వాన, ఆర్గనైజింగ్ సెక్రటరీగా మహమ్మద్ అలి, రాజు, ఉమెన్ వింగ్ సెక్రటరీలుగా త్రివేణి, అరుణ, మమత, ఈసీ మెంబర్లుగా రాము, సాయినాథ్, ధనుంజయను ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులను ఘనంగా సన్మానించారు.


పంచాయతీ కార్యదర్శుల జిల్లా నూతన కార్యవర్గం

ప్రత్యామ్నాయ పంటలపైనే రైతుల ఆశలు

వేరుశనగ సాగుకు ముగిసిన అదును..చిరుధాన్యాల విత్తనం కోసం రైతుల ఎదురుచూపులు

ప్రజాశక్తి-కదిరి అర్బన్

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో వర్షాధార పంటల సాగులో వేరుశనగ పంట ప్రధానమైంది. దీంతో రైతులు అదునులో విత్తనం వేసేందుకు ప్రభుత్వం రాయితీపై అందజేసిన విత్తన వేరుశనగతో పాటు నిల్వ ఉంచుకున్న రైతుల వద్ద కూడా విత్తన వేరుశనగ సేకరించి సర్వం సిద్ధం చేసుకున్నారు. అయితే సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవకపోవడంతో పదును కాక అధిక శాతం రైతులు వేరుశనగ విత్తనం వేయలేకపోయారు. ప్రస్తుతం వేరుశనగ పంట సాగు చేసేందుకు అదును దాదాపు ముగిసినట్లేనని రైతులు పేర్కొంటున్నారు. ఈ సీజన్‌లో వాతావరణం కూడా ఆశించిన రీతిలో అనుకూలించలేదన్న ఆవేదన కూడా రైతుల్లో కనిపిస్తుంది. దీంతో ఇక చేసేదేమీ లేక రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. ఇందుకు ప్రభుత్వం చిరుధాన్యాల సాగుపై చేపట్టిన విస్తృత అవగాహన కార్యక్రమాలు కూడా కారణం కావొచ్చు. చిరుధాన్యాలు సాగు చేస్తే ఆదాయం కూడా ఆశించిన స్థాయిలో వస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అయితే చిరుధాన్యాలు సాగు చేయాలంటే సరైన విత్తనం కావాల్సి ఉంది. కావున రాష్ట్ర ప్రభుత్వం పెసలు, అలసందలు జొన్న, కొర్ర, శ్యామలు అందించాలని రైతుల కోరుతున్నారు. చిరుధాన్యాలు పంపిణీ చేయడానికి సంబంధిత అధికారులు కూడా రాష్ట్ర ప్రభుత్వానికి ఇప్పటికే ప్రతిపాదనలు పంపినట్లు తెలుస్తోంది. చిరుధాన్యాల సాగుకు ఆగస్టు మాసం మంచి సమయమని ప్రభుత్వం త్వరగా చిరుధాన్యాల విత్తనం పంపిణీ చేయాలని రైతులు కోరుతున్నారు. మరోవైపు పంటలు సాగు చేయడానికి కూలీల ధరలు పెరగడంతో వ్యవసాయం భారమైన కొందరు రైతులు పాడి పరిశ్రమ వైపు అడుగులు వేస్తున్నారు.

గ్రామాల్లో సమస్యల పరిష్కానికే తొలి ప్రాధాన్యత

టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్

ప్రజాశక్తి-ముదిగుబ్బ

గ్రామాల్లో సమస్యల పరిష్కానికే కూటమి ప్రభుత్వం లో తొలి ప్రాధాన్యత అని ధర్మవరం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ తెలిపారు. శ్రీరామ్ ఆదివారం మండలంలోని నల్లచెర్లోపల్లి గ్రామంలో శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవానికి హాజరయ్యారు. అనంతరం ఆయన స్థానిక టిడిపి నాయకులతో కలిసి గ్రామంలో కలియ తిరిగారు. డ్రెయినేజీ, తాగునీరు, వాటర్ ప్లాంట్ ఏర్పాటు, విద్యుత్ పోల్స్, లో వోల్టేజ్, తదితర సమస్యలను గ్రామస్తులు శ్రీరామ్ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన శ్రీరామ్ ఆయా సమస్యలను మంత్రి సత్యకుమార్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారి స్తామని హామీ ఇచ్చారు. అలాగే విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి సబ్ స్టేషన్ ఏర్పాటు చేయిస్తా మని హామీ ఇచ్చారు. సబ్ స్టేషన్ కోసం స్థలాన్ని పరిశీలించారు. శ్రీరామ్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ హయాంలో గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. కనీసం పంచాయతీలకు వచ్చే నిధులు కూడా దక్కకుండా చేశారన్నారు. కూటమి ప్రభుత్వం కచ్చితమైన ప్రణాళికతో ఉందని, గ్రామాలను అభివృద్ధి బాట పట్టిస్తామని తెలిపారు. శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవంలో జనసేన ఇన్‌ఛార్జి చిలకం మధుసూదన్‌రెడ్డి కూడా పాల్గొన్నారు.


నల్లచెర్లోపల్లిలో పర్యటిస్తున్న పరిటాల శ్రీరామ్

యుటిఎఫ్ చెస్ పోటీల విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యుటిఎఫ్) స్వర్ణోత్సవ సంబరాల సందర్భంగా రెండు రోజులుగా పట్టణంలోని కాకతీయ విద్యానికేతన్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి చెస్ పోటీలు ఆదివా రం ముగిశాయి. మహిళా టీచర్స్ విభాగంలో అమలాపురం గ్రామానికి చెందిన సబిహాబాను, ఎన్‌పి కుంటకు చెందిన సీతా రత్నం, ధర్మవరం పట్టణానికి చెందిన దుర్గ, మహేశ్వరి, పురుషుల టీచర్స్ విభాగంలో కొత్తచెరువు మండలంలోని కేశాపురం గ్రామానికి చెందిన శివకృష్ణ, గుడిబండకు చెందిన జయచంద్ర, లేపాక్షికి చెందిన శ్రీనివాసరెడ్డి, సికె పల్లికి చెందిన లక్ష్మీనారాయణ స్వామి విజేతలుగా నిలిచారు. వారికి యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టి విజయచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి సుధాకర్, ఉపాధ్యక్షులు జిహెచ్ బాబు, ఆడిట్ కమిటీ మెంబర్ రామకృష్ణానాయక్, సీని యర్ నాయకులు నారాయణస్వామి, చెన్నకేశవులు మెమెంటోలు, బహుమతులు ప్రదానం చేశారు. విజేతల ఉపాధ్యాయులు సెప్టెంబర్‌లో గుంటూరులో జరిగే రాష్ట్ర స్థాయి యుటిఎఫ్ స్వర్ణోత్సవ పోటీలకు అర్హత సాధించారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో న్యాయ నిర్ణేతలు ఆదిరత్నాకర్, కిశోర్‌కుమార్, సోమశేఖరప్రసాద్, పీడీలు రమేశ్, నాగేంద్ర పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు అందజేస్తున్న యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు జయచంద్రారెడ్డి

పురం అప్‌గ్రేడ్ స్టేషన్, రూరల్ సిఐలు బాధ్యతల స్వీకరణ

అప్ గ్రేడ్ స్టేషన్ సిఐగా ఆంజనేయులు

ప్రజాశక్తి-హిందూపురం

రూరల్ మండలం అప్‌గ్రేడ్ స్టేషన్ సిఐగా ఆంజనే యులు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. నూతన సిఐ మాట్లాడు తూ రూరల్ మండల వ్యాప్తంగా శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యే క ప్రాధాన్యత ఇస్తామన్నారు. ముఖ్యంగా తూముకుంట, గోళా పురం పారిశ్రామికవాడలపై ప్రత్యేక నిఘా పెడతామన్నారు. గతం లో ఇక్కడ ఎస్ఐగా విధులు నిర్వహించానని మండల వ్యాప్తంగా 14 గ్రామపంచాయతీలపై పట్టు ఉందన్నారు. మట్కా, గ్యాంబ్లిం గ్, తదితర సంఘ విద్రోహ కార్యక్రమా లపై ప్రత్యేక దృష్టి సారించి అరికడతామన్నారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను ఎప్పటి కప్పుడు పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం ఆయన డీఎస్పీ కంజాక్షన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన సిఐని పలువురు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.


అప్ గ్రేడ్ స్టేషన్ సిఐ ఆంజనేయులు


రూరల్ సిఐ కె.జనార్దన్

అక్రమార్కుల్లో గుబులు

హిందూపురం రూరల్ మండల అప్ గ్రేడ్ స్టేషన్ సిఐగా ఆంజనేయులు బాధ్యతలు స్వీకరిం చడంతో హిందూపురం రూరల్ మండలంతో పాటు పట్టణం, లేపాక్షి, చిలమత్తూరు మండలాల వ్యాప్తంగా ఉన్న అక్రమార్కులు హడలెత్తిపోతున్నారు. స్టేషన్ అప్‌గ్రేడ్ కాక ముందు ఇదే స్టేషన్‌లో ఆయన ఎస్ఐగా పని చేశారు. ఆ సమయంలో మండల వ్యాప్తంగా శాంతి భద్రతల పరిరక్షణకు తన వంతు కృషి చేయడంతో పాటు నిరుద్యోగ యువకులను గుర్తించి సొంత నిధులతో పోలీసు ఉద్యోగాలకు ప్రత్యేకంగా శిక్షణ ఇప్పించారు. మట్కా, పేకాట, అధిక వడ్డీ, అక్రమార్కులపై ఉక్కు పాదం మోపి తన మార్కు చాటుకున్నారు. ప్రస్తుతం తిరుపతి సిఐడి నుంచి హిందూపురం పోలీస్ స్టేషన్‌కు సిఐగా వచ్చారు.

పురం రూరల్ సిఐగా కె.జనార్దన్

హిందూపురం : హిందూపురం రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా కె.జనార్దన్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ రూరల్ పరిధిలోని లేపాక్షి, చిలమత్తూరు మండలాల పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తానన్నారు. మట్కా, గ్యాంబ్లింగ్, తదితర సంఘ విద్రోహ కార్యక్రమాలపై దృష్టి సారించి అరికడతామన్నారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కషి చేస్తానన్నారు.

26న శ్రీకృష్ణాష్టమి వేడుకలు

సోమందేపల్లి : స్థానిక పాతూరులో వెలసిన కాలమ్మ గుడి ఆవరణలో ఈ నెల 26వ తేదీ శ్రీకృష్ణాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహిద్దామని మండల యాదవ సంఘం నాయకులు పిలుపు నిచ్చారు. ఈ విషయమై ఆదివారం మధ్యాహ్నం యాదవ సంఘం నాయకులు సమావేశమయ్యారు. శ్రీకృష్ణాష్టమి సందర్భంగా యాదవుల ఆరాధ్య దైవమైన శ్రీకృష్ణుని ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు, భక్తులకు అన్నదానం ఏర్పాటు చేద్దామని తెలిపారు. అదేరోజు సాయంత్రం చిన్నారులతో రాధా, కృష్ణ వేషాధారణ, ఉత్సవ విగ్రహం ఊరేగింపు కార్యక్ర మాలు ఉంటాయని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో ప్రతి యాదవ కుటుంబం పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం ఆహ్వాన పత్రికలు విడుదల చేశారు. కార్యక్రమంలో సభ్యులు ఎజి.నారాయణస్వామి, ఎజి.శ్రీనివాసులు, జిపి.నరసింహులు, జి.మహేష్, మాజీ ఎంపీటీసీ ప్రభాకర్, ధనంజయ, లక్ష్మీకాంత్, శ్రీనివాసులు, రమేష్, ఉపేంద్ర, అంజి, గోపాల్, మైలారి, ఓబులేష్, గణేష్ పాల్గొన్నారు.


శ్రీకృష్ణాష్టమి వేడుకల ఆహ్వాన పత్రిక ఆవిష్కరిస్తున్న నాయకులు


నాగుల ప్రతిష్టాపనలో పాల్గొన్న ఎంపి బికె.పార్థసారధి

నాగుల ప్రతిష్టాపనలో ఎంపీ

సోమందేపల్లి : పెనుకొండ మండలంలోని కురుబవాండ్లపల్లి గ్రామంలో ఆదివారం నాగుల ప్రతిష్టాపన కార్యక్రమంలో హిందూపురం ఎంపి బికె.పార్థసారధి పాల్గొని పూజలు నిర్వహించారు. ఎంపిని స్థానిక టిడిపి నాయకులు ఘనంగా సన్మానించారు. ఎంపి వెంట నాయకులు జివిపి నాయుడు, రొద్దం నరసింహులు, కార్యకర్తలు ఉన్నారు.

నేటి నుంచి సర్పంచులకు శిక్షణ

బుక్కపట్నం : మండలంలోని సర్పంచులు, పంచా యతీ కార్యదర్శులకు సోమవారం నుంచి స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శిక్షణ తరగతులు ఉంటాయని ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు. పంచాయ తీల అభివృద్ధి, చేపట్టబోయే పనుల గురించి మూడు రోజుల పాటు శిక్షణ ఇస్తారని, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు హాజరుకావాలని ఆయన తెలిపారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ధర్మవరం టౌన్ : పట్టణంలోని రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శంకర కంటి ఆసుపత్రి సహాయ సహకారాలతో ఆదివారం పుట్టపర్తికి చెందిన ఇంజినీర్ శ్రీధర్ తల్లి అశ్వర్థమ్మ జ్ఞాపకార్థం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించినట్లు క్లబ్ ఉపాధ్యక్షుడు నరేంద్రరెడ్డి తెలిపారు. శిబిరంలో 146 మందికి కంటి వైద్యులు పరీక్షలు చేసి 89 మందిని ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. రోటరీ క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ 1994 నుంచి ఇప్పటి వరకూ 34వేల మందికి పైగా కంటి ఆపరేషన్లు చేయించినట్లు తెలిపారు. శిబిరంలో రోటరీ క్లబ్ సెక్రటరీ నాగభూ షణం, క్యాంపు ఛైర్మన్ శ్రీనివాసరెడ్డి, క్లబ్ ప్రతినిధులు ప్రసన్న, శివయ్య, సుదర్శనగుప్తా, మనోహరగుప్తా, కొండయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.

కెవిపిఎస్ తరగతులకు తరలిన నాయకులు

పుట్టపర్తి రూరల్ : భీమవరంలో నిర్వహిస్తున్న కెవిపి ఎస్ రాష్ట్ర ప్రత్యేక తరగతులకు ఆదివారం శ్రీసత్యసాయి, అనంత పురం జిల్లా నాయకులు, నృత్య, ఉరుముల కళాకారుల సంఘం నాయకులు వెళ్లారు. శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షులు అన్నమయ్య, ప్రధాన కార్యదర్శి ఎంవి.రమణ, చౌడప్ప, నీలమ్మ, గంగమ్మ, శశికళ, భాస్కర్, రామాంజనేయులు, యోగానంద, గోవిందప్ప ప్రత్యేక వాహంలో వెళ్లారు. అనంత పురం జిల్లా ఉరుముల కళాకారుల సంఘం రాష్ట్ర నాయకులు బత్తల ఆదినారాయణ, నాగేంద్ర, అపర్ణ, సరోజ, రామలక్ష్మమ్మ వెళ్లారు.

నేరాలు ఘోరాలు

పుట్టపర్తి -బెంగళూరు ఆర్టీసీ బస్సు బోల్తా

13 మందికి గాయాలు.. ఇద్దరి పరిస్థితి విషమం

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

బెంగళూరు-హైదరాబాద్ జాతీయ రహదారి-44పై చుండూ రు క్రాస్ వద్ద ఆదివారం మధ్యా హ్నం 3 గంటల సమయంలో అదుపు తప్పి పుట్టపర్తి-బెంగళూరు బస్సు బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్‌తోపాటు 13 మంది ప్రయాణికులకు గాయాలు కాగా, వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. గుడిబండ పోలీసులు తెలిపిన వివరాలు.. బెంగళూరు నుంచి పుట్టపర్తికి వెళ్తున్న పుట్టపర్తి డిపో ఆర్టీసీ బస్సు గుడిబండ తాలూకాలోని చుండూరు క్రాస్ సమీపంలో అదుపుతప్పి బోల్తా పడింది. ఆ సమయంలో బస్సులో సుమారు 30 మంది ప్రయాణిస్తుండగా, డ్రైవర్‌తో సహా 13 మంది గాయపడ్డారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో చిక్కబళ్లాపూర్ జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మిగిలిన వారు బాగేపల్లి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతు న్నారు. బస్సు అదుపుతప్పి పక్కన ఉన్న గుంతలోకి దూసుకుపోవడంతో ప్రమాదం జరిగినట్లు పోలీసులు ధ్రువీకరించారు. విషయం తెలిసిన వెంటనే గుడిబండ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. అలాగే పుట్టపర్తి ఆర్టీసీ డిపో అధికారులు అక్కడికి చేరుకున్నారు. బస్సు బోల్తా పడిన వెంటనే స్థానికులు స్పందించి గాయపడిన డ్రైవర్‌ను, ప్రయాణికులను బస్సులో నుంచి కిందికి దించి అంబులెన్స్‌లో ఆసుపత్రులకు తరలించారు.


రోడ్డు పక్కన బోల్తా పడిన ఆర్టీసీ బస్సు

కార్లు ఢీ.. కర్నాటక యువకుడు మృతి

చిలమత్తూరు : మండలంలోని దేమకేతేపల్లి గ్రామ సమీపంలో కొడికొండ చెక్‌పోస్ట్-శిర జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కర్నాటకకు చెందిన ఒకరు మృతి చెందగా మరో ముగ్గురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు.. హిందుపురం వైపు నుంచి వస్తున్న కారు చిలమత్తూరు వైపు నుంచి వస్తున్న మరో కారు దేమకేతేపల్లి గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కర్నాటకలోని శ్రీనివాసపురం గ్రామానికి చెందిన మధుసూదన్(28) అక్కడికక్కడే మృతి చెందగా మరో ముగ్గురు గాయపడ్డారు. మధుసూదన్ ప్రభుత్వాసుపత్రిలో పని చేస్తుండేవాడు. ఈ ఘటనలో రెండు కార్లు నుజ్జునుజ్జు అయ్యాయి. గాయపడిన వారిని హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి.. ఇద్దరు అరెస్ట్

రూ. 1.7 లక్షలు, సెల్ ఫోన్లు, బైక్ స్వాధీనం

మడకశిర : కర్నాటక సమీపంలోని మడకశిర మండలం సరిహద్దులో ఉన్న ఎల్లోటి గ్రామ శివారులో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై ఆదివారం పోలీసులు దాడి చేసి ఇద్దరిని అరెస్టు చేశారు. అలాగే వారి నుంచి నగదు, సెల్‌ఫోన్లు, బైక్ స్వాధీనం చేసుకున్నారు. మడకశిర రూరల్ సిఐ రాజ్‌కుమార్ తెలిపిన వివరాలు.. అందిన సమాచారం మేరకు సిబ్బంది అనిల్, సుధాకర్, శ్రీను, మంజునాథ్, సంజీవ రాయప్ప, హోంగార్డులు ప్రశాంత్, రంగప్పతో కలిసి పేకాట స్థావరంపై మెరుపు దాడి చేశామన్నారు. పోలీసులను గమనించి జూదరులు పారిపోతుండగా పోలీసులు వెంటపడి భార్గవ్, నరసింహప్పలను అరెస్టు చేయగా మిగిలిన వారు పారిపోయారు. వారి నుంచి రూ. 1,72,500 నగదు, 3 సెల్‌ఫోన్లు, ఒక మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిపై కేసు నమోదు చేశమని, పరారైన 14 మందిని త్వరలోనే పట్టుకుంటామని సిఐ తెలిపారు.

మున్సిపల్ కాంట్రాక్ట్ వర్కర్ మృతి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కొన్నేళ్లుగా ఆర్. మల్లికార్జున(48) ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా పని చేస్తున్నారు. ఈ నెల 4వ తేదీ ఎర్రగుంట వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో స్థానికులు ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి పంపారు. అక్కడ చికిత్స అనంతరం బత్తలపల్లిలోని ఆర్‌డిటి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందారు. అతడికి భార్య, ఇతరు పిల్లలు ఉన్నారు. సమాచారం అందుకున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్లు శ్యాంసన్, కేశవ, తోటి వర్కర్లు సంతాపం తెలిపారు. కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

పుట్టపర్తి రూరల్ : జిల్లా వ్యాపంగా ఆదివారం ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో పోలీసులు రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని సత్ప్రవర్తనతో మెలగాలని పోలీస్ అధికారులు వారిని హెచ్చరించారు. వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో నేరాలకు పాల్పడిన జిల్లాలోని రౌడీషీటర్లను ఆయా పోలీస్ స్టేషన్లకు పిలిపించి సిఐ, ఎస్ఐల ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ ఇచ్చారు. వీరి గత నేర చరిత్ర, ప్రస్తుత జీవన విధానం, స్థితిగతులపై ఆరా తీశారు. గత చరిత్ర పునరావృతమైతే కఠినమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి రౌడీషీటర్ కదలికలపై లోతుగా నిఘా వేశామన్నారు. అలాగే జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు వాహనదారులకు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పక వాడాలని, ప్రతి ఒక్కరూ వాహనాలకు సంబంధించిన పత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు.

ఆలయానికి వెండి ఆభరణాలు అందజేత

ధర్మవరం టౌన్ : పట్టణంలోని తొగటవీధిలో వెలసిన శ్రీశాంతకళా చౌడేశ్వరీదేవి ఆలయానికి ఆదివారం బెంగళూరుకు చెందిన జయప్రకాష్, రమ్య నాగమణి దంపతులు కిలో వెండి ఆభరణాలను ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కమిటీ అధ్యక్షులు బంధనాదం రమణ, దాసరి వెంకటేశులు(చిట్టి) మాట్లాడుతూ భక్తులు అమ్మవారికి మూడు గిన్నెలు, రెండు గ్లాసులు, అమ్మవారి విగ్రహం, ఒక తట్ట అందజేశారని తెలిపారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యం లో జయప్రకాష్ దంపతులను సత్కరించి అమ్మవారి విగ్రహాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సిరివెళ్ల రాధాకృష్ణ, బండి నాగరాజు, పెద్దకోట్ల విజయ్, పెద్దకోట్ల భాస్కర్, జయచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ ముఖద్వారం స్థాపన

ధర్మవరం టౌన్ : పట్టణంలోని సిద్దయ్యగుట్టలో వెలిసిన శ్రీలక్ష్మీనరసిం హస్వామి దేవాలయంలో ఆలయ ముఖ ద్వార స్థాపన కార్యక్రమం ఆదివారం వేదమంత్రాలు, మంగళ వాయిద్యాలు నడుమ సంప్రదాయ పద్ధతిలో నిర్వహించి నట్లు ఆలయ అధ్యక్షురాలు జయశ్రీ తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ నరసిం హులు, గడ్డం పార్థసారధి, పుట్లూరు నరసింహులు, అంబటి అవినాష్, డిజైనర్ నాగరాజు, ఇంజినీర్ లోకేష్, భక్తులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి 'పల్లె' పరామర్శ

నల్లమాడ : మండలంలోని గోపేపల్లి గ్రామంలో ఇటీవల జరిగిన మొహర్రం వేడుకల్లో తీవ్రంగా గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న గోపేపల్లి పంచాయతీ కార్యదర్శి దాదిరెడ్డి విశ్వనాథ్‌రెడ్డిని ఆదివారం మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ఆర్టీసీ డిపోలో ఎన్ఎంయు సమావేశం

మడకశిర రూరల్ : పట్టణంలోని మార్కెట్ యార్డ్‌లో ఆదివారం నేషనల్ మజ్దూర్ యూనిట్ అసోసియేషన్(ఎన్ఎంయుఎ) ఆధ్వర్యంలో మడకశిర డిపో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో జోనల్ కార్యదర్శి చెన్నారెడ్డి, జిల్లా కార్యదర్శి షబ్బీర్, నాయకులు సుబ్బరాయుడు, ఎంసి మెంబర్ గోపాలప్ప, రవితేజ, తిరుపతమ్మ, రంగనాథ్, తదితరులు పాల్గొన్నారు.


సమావేశం నిర్వహిస్తున్న ఎన్ఎంయు నాయకులు